ప్రజాశక్తి

గురువారం 20 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బయటపడేదెలా?

- విశాఖ డెయిరీ డైరెక్టర్ల అన్వేషణ
- సభా సంఘం వద్ద పొంతనలేని మాటలు
- అంతా చైర్మన్‌కు తెలుసంటూ సమాధానం
- అవినీతిపై బిగుస్తున్న పట్టు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అవినీతి, అక్రమాలపై పట్టు బిగుసుకుంటోంది. పట్టుమీద కొడిపెట్టలా దొరికిపోయే నాటకీయ పరిమాణాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతవరకు డెయిరీ చైర్మన్లకు సహకరించి పాల రైతుల సొమ్ము దిగమింగిన డైరెక్టర్లు అవినీతి పాపంలో తమకేమీపాత్రలేదని చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నాలు ఆరంభించారు. పాల రైతుల సొమ్ముతిని తెగబలిసిన వీరు డెయిరీ నిధుల వినియోగ వ్యవహారాలు తమకేమీ తెలీవంటూ తమను తాము రక్షించుకోడానికి డైరెక్టర్లు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో విశాఖ డెయిరీలో అవకతవకల విచారణకు ఏర్పాటైన ప్రత్యేక సభా సంఘం సమావేశమైంది. దీనికి డెయిరీకి సంబంధించి 15 మంది ప్రతినిధులు వెళ్లారు. సభా సంఘం అడిగిన ఏ ప్రశ్నకూ వారు సరైన సమాధానం చెప్పకుండా చైర్మన్‌కు తెలుసంటూ తప్పించుకొనేలా మాట్లాడారు. సమాధానాలపై అసంతృప్తి వ్యక్తంచేసిన సభాసంఘం పూర్తి వివరాలు ఇవ్వడంతో పాటు వచ్చే సమావేశానికి ఆనంద్‌ను హాజరు కావాలని ఆదేశించడంతో డెయిరీ పాలకవర్గానికి ముచ్చెమటలు పడుతున్నాయి. చైర్మన్‌ను వెనుకేసుకువస్తే అడ్డంగా దొరికిపోతామని ముందుచూపుతో బయటపడే మార్గాలు డైరెక్టర్లు అన్వేషిస్తున్నారు. తప్పంతా చైర్మన్, ఎమ్‌డిపైకి నెట్టి అవినీతి వ్యవహారంలో తమపాత్రేమీలేదని నమ్మించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

సహకార రంగం నుంచి కంపెనీ యాక్టు పరిధిలోకి విశాఖ డెయిరీని తీసుకురావడం వరకు పరస్పరం సహకరించుకున్నారు. కార్యక్రమాల పేరుతో డెయిరీ నిధులు భారీగా దుర్వినియోగం చేసిన వాటన్నింటిలోనూ కొందరు డైరెక్టర్లు చైర్మన్‌కు వెన్నంటివున్నారు. ప్రతి ఉల్లంఘనలోనూ వీరి పాత్ర ఉంది. అందుకనే, తమకు కావాల్సిన, తమచేతుల్లోని మనుషులను డైరెక్టర్లుగా పెట్టుకొని ఆనందకుమార్ పాలకవర్గాన్ని కూర్పు చేసుకున్నారు. పాల రైతుల సొమ్ము సొంతానికి వినియోగించుకున్నా అడిగేవారు లేకుండా చేసుకోవడం విశాఖ డెయిరీలో సాగుతూవచ్చింది. డెయిరీ నిధుల దుర్వినియోగం బయటపడేందుకు పాల సేకరణ, పాల ఉత్పత్తుల తయారీ, అమ్మకం, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ, ఖర్చులు, రైతులు, ఉద్యోగుల సంక్షేమం నిమిత్తం ఏర్పాటుచేసిన

మిగతా 2లో..

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ సమీక్ష

ప్రజాశక్తి- శాఖ కలెక్టరేట్ : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవం ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్లాట్ల ప్రకారం దర్శనాలకు అనుమతించాలని, ఇతర కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 30వ తేదీ తెల్లవారు జాము 3.30 నుంచి 4.30 గంటల వరకు మాత్రమే అనువంశిక ధర్మకర్త, తితిదే నుంచి పట్టువస్త్రాలు సమర్పించే వారికి, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు, దాతలకు అంతరాలయ దర్శనాలు ఉంటాయని పేర్కొన్నారు. తర్వాత వచ్చే విఐపిలకు, ఇతరులకు అంతరాలయ దర్శనం కల్పించాలా లేదా అనే అంశంపై రాష్ట్ర అధికారులతో మాట్లాడిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. 29వ తేదీ రాత్రి 6 గంటల నుంచే సాధారణ దర్శనాలు నిలిపివేస్తామనే విషయాన్ని భక్తులకు తెలియపరచాలని సూచించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఇతర ఎడిసిపిలు, దేవాదాయ శాఖ అధికారులు, సింహాచలం ఆలయ ఈవో కె.సుబ్బారావు, డిఆర్ఒ బిహెచ్.భవానీశంకర్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, ఇతర అధికారులతో కలిసి స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం సాయంత్రం చందనోత్సవం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. చందనోత్సవం వేడుకను ప్రతిష్టాత్మకంగా తీసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. టిక్కెట్ల విక్రయ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, నగర పరిధిలోని అనుకూల ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిర్ణీత సమయంలోగా టిక్కెట్ల విక్రయాల ప్రక్రియను పూర్తి చేయాలని

మిగతా 2లో..

పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

స్ట్రాటజిక్ సేల్ నిర్ణయం రద్దు చేయాలి

జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

వార్త మెయిన్ 3లో..

ఆస్తి విలువ ఆధారిత పన్ను రద్దు చేయాలని ధర్నా

వార్త మెయిన్ 3లో..

ఎంఎస్ఎంఇ అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మంత్రి కొండపల్లి

వార్త మెయిన్ 3లో..

జివిఎంసి బడ్జెట్ సమావేశం నిర్వహించండి

మేయర్‌కు సిపిఎం కార్పొరేటర్ గంగారావు విజ్ఞప్తి

మేయర్‌కు వినతి అందిస్తున్న గంగారావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట : 2025 మార్చి నెల ముగింపునకు వచ్చినా ఇప్పటి వరకు జి వి ఎ ం సి 2025-26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ఆమోదం కోసం కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని, జాప్యం లేకుండా వెంటనే ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారికి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు వినతి అందించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1955 ప్రకారం జివిఎంసి ఆర్థిక సంవత్సర బడ్జెట్ మార్చినెలలోపు కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి ఆమోదింపజేయాలని, స్టాండిగ్ కమిటీ బడ్జెట్ ప్రతిపాదనను ఆమోదించినప్పటికీ నేటి వరకు ప్రత్యేక బడ్జెట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని తెలిపారు. దీనిపై మేయర్ స్పందిస్తూ జివిఎంసి బడ్జెట్ సమావేశం మార్చి 22 లేదా 29వ తేదీలలో నిర్వహించాలని జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌ను ఈ నెల 15వ తేదీన రాతపూర్వకంగా కోరినట్లు ఆమె చెప్పారు.

అనంతరం గంగారావు మాట్లాడుతూ, జివిఎంసి కౌన్సిల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేయవద్దని రాష్ట్ర కూటమి ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోందని, ఇది హేయమైన చర్య అని పేర్కొన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జివిఎంసిలోని 25 లక్షల ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయటం కూటమి ప్రభుత్వానికి తగని పని అని తెలిపారు. బడ్జెట్ ఆమోదం కాకపోవడంతో ఏప్రిల్ నుండి వేతనాలు, ప్రజాపనులు, మౌలిక వసతులు తదితరాలు పూర్తిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. జివిఎంసి ఆర్థిక లావాదేవీలు, పరిపాలనా ప్రక్రియ పూర్తిగా స్థంభించిపోతుందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఈ నెల 30వ తేదీ లోపు జివిఎంసి ప్రత్యేక బడ్జెట్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తిచేశారు. మేయర్ తమ యొక్క విచక్షణాధికారాన్ని ఉపయోగించి తక్షణం కౌన్సిల్ సమావేశ తేదీ నిర్ణయించి అమలకు పూనుకోవాలని కోరారు. తక్షణం కౌన్సిల్‌లోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించాలని మేయర్‌ను కోరారు.

'ల్యాండ్ మార్క్'లపై రాజకీయ యుద్ధం

- వైజాగ్ క్రికెట్ స్టేడియానికి ఉన్న వైఎస్ఆర్ పేరు తొలగింపు
- విశాఖను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసిందా?

వైఎస్ఆర్ పేరు తొలగించి ఏర్పాటుచేసిన బోర్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

2019-2025 మధ్య రాష్ట్ర రాజకీయాల్లో అధికారంలోకి వచ్చిన నేతల పనులు చూస్తే వారు వీరవుతున్నారు.. వీరు వారవుతున్నారని చెప్పక తప్పదు. 2019లో రాష్ట్రంలో అధికారం చేపట్టాక ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరులో 'ఎన్‌టిఆర్'ను తొలగించిన సంగతి తెలిసిందే. తాజాగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో వీరి నిర్ణయాలు విశాఖను టార్గెట్ చేస్తున్నాయని చెప్పక తప్పదు. అధికారం లేనప్పుడు తేనెపూసిన మాటలతో ప్రజల మనసులను గెలిచేందుకు అవస్థలు పడడం తర్వాత ఒడ్డున పెట్టేయడం రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలకు అలవాటైపోయింది. ఈ విషయంలో వైసిపి, టిడిపి కూటమి రెండూ దొందూ దొందే..

ల్యాండ్ మార్క్‌లపై యుద్ధం...

గత వైసిపి జగన్ ప్రభుత్వం విశాఖను రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ముద్ర లేకుండా చేసే దిశగా చంద్రబాబు సర్కారు అడుగులు వేస్తోంది. కూటమి పాలన 2024 నుంచి ఆరంభం అయ్యాక నగరం నడిబొడ్డున పాత జైలు రోడ్డు వద్దగల వైఎస్ఆర్ సిటీ సెంట్రల్ పేరుతో గల జివిఎంసి పార్కు బోర్డులో వైఎస్.రాజశేఖరరెడ్డి సిటీ సెంట్రల్ పార్కు అని బోర్డు ఉండేది. వైఎస్ఆర్ అనే పేరును చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. తాజాగా విశాఖలోని పిఎంపాలెంలో డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంగా ఉన్నదాన్ని ఎసిఎ, విడిసిఎ క్రికెట్ స్టేడియంగా

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బయటపడేదెలా?

మిల్క్ ప్రొడ్యూసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ (ఎంపిఅండ్ ఇహెచ్ఎండబ్ల్యు)కు వచ్చే ఆదాయం, దాని సేవలు, కార్యక్రమాలు, సంక్షేమానికి చేసిన ఖర్చులపై మిల్క్, ఫైనాన్స్ ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ ఎంతోకాలంగా ఉంది.

రైతుల సొమ్ము తినమరిగిన వీరు, ఇవేమీ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. నైపుణ్య అభివృద్ధి శిక్షణకు చేసిన కోట్ల రూపాయల ఖర్చు, డెయిరీ ట్రస్టు నిధులతో నిర్మించిన ఆసుపత్రిని కిమ్స్ ఆస్పత్రికి అప్పగించడం వెనుక జరిగిన అవినీతిపై వస్తున్న విమర్శలపై సభా సంఘం ఆరా తీసింది. పాల సేకరణ, పాల ఉత్పత్తుల తయారీ, అమ్మకం, నిధుల జమ, ట్రస్టు కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో సభా సంఘం లోతుగా పరిశీలిస్తే డెయిరీ అవినీతి భాగోతం బయటపడనుంది.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. రూ.1500, రూ.1,000, రూ.300 ధరల మేరకు టిక్కెట్ల జారీ ప్రక్రియను ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. రూ.1,500 టిక్కెట్లు కొనుగోలు చేసిన వారికి మాత్రమే నీలాద్రి గుమ్మం వద్ద నుంచి దర్శనానికి అనుమతిస్తారని స్పష్టం చేశారు. కొండపైకి వాహనాల రాకపోకలను గణనీయంగా తగ్గించాలని, ఆ మేరకు ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని పోలీసు విభాగ అధికారులకు చెప్పారు. హనుమంతవాక వైపు నుంచి పాత గోశాల వరకు, అక్కడ నుంచి అడవివరం వరకు రెండు పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని హనుమంతవాక మార్గం వైపు, అడవివరం వైపు వీలైనన్ని పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా కొండ దిగువ నుంచి పైకి తరలించేందుకు, దర్శనం అయిపోయిన తర్వాత కొండ దిగువన దించేందుకు అనువుగా తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని, ఎక్కడికక్కడ క్యూలైన్లలో విరివిగా తాగునీటి కేంద్రాలను, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటుచేయాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గతం కంటే రెట్టింపు సంఖ్యలో వైద్య శిబిరాలను పెట్టాలన్నారు. మరుగుదొడ్లు ఇతర వసతులు సమకూర్చాలని చెప్పారు. వాహనాల రద్దీని గణనీయంగా తగ్గించేందుకు పాసులను మంజూరు చేయాలని, ప్రయివేటు వాహనాలను కొండపైకి అనుమతించరాదని స్పష్టం చేశారు.

పార్కింగ్ సమస్యను అధిగమించేందుకు సింహాచలం కొండపై అదనపు పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని, శాశ్వత పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేయగా సంబంధిత చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ, పోలీసు, జివిఎంసి, విద్యుత్, వైద్య, రవాణా, ఆర్టీసీ, రెవెన్యూ తదితర విభాగాల ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ల్యాండ్ మార్క్'లపై రాజకీయ యుద్ధం

మార్చివేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గతంలో వైజాగ్ ఫిలింనగర్ క్లబ్‌లోని లాన్‌కు ఉన్న వైఎస్ఆర్ పేరును కూడా అధికార యంత్రాంగం తొలగించింది. దీంతో విశాఖలోని వైసిపి శ్రేణులు భగ్గుమంటున్నాయి. వైఎస్ జగన్ హయాంలో క్రికెట్ స్టేడియానికి ఆ పేరు పెట్టలేదని, అంతకు ముందు నుంచీ ఆ పేరుందంటూ వైసిపి శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి.

ఇదేం సంప్రదాయం? రాజకీయ ఒరవడి?

సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా 'ల్యాండ్ మార్క్'గా కొన్ని చిహ్నాలుండడం సహజం. ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వారి పార్టీ అగ్రనేతల పేర్లు, తర్వాత అధికారం కోల్పోయాక అధికారంలోకి వచ్చిన వారు వాటిని పేర్లు మార్చడం సంప్రదాయమా? అనే చర్చ వినిపిస్తోంది. ఉదాహరణకు తెలంగాణలో రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంది. కాంగ్రెసేతర పాలనలోనూ దీన్ని ఎవ్వరూ ముట్టుకోలేదు. విశాఖలో ఇందిరా జూలాజికల్ పార్కు ఉంది. దీన్ని బిజెపి మార్చేసిందా? ఇందిరాగాంధీ స్టేడియం కూడా విశాఖలో ఉంది. రాజకీయాలు వేడెక్కడంతో తెరపైకి పేర్ల రగడ ముందుకొచ్చింది.

సునీతా విలియమ్స్‌కు పోర్టు ఛైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : అసాధారణమైన అంతరిక్ష ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసి భూమికి తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్‌కు విశాఖపట్నం పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతరిక్ష అన్వేషణలో ఆమె అంకితభావం, పట్టుదల, విశేషమైన విజయాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి, ముఖ్యంగా యువతకు, తమ కలలను సాకారం చేసుకునేందుకు నూతన ప్రేరణను అందిస్తోందని పేర్కొన్నారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

లోహియా ఆటో ఇండస్ట్రీస్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మరో ఏడాది పాటు కాంట్రాక్ట్ రెన్యువల్ ఉండగా ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, నోటి మాటతో డ్రైవర్లను నిలుపుదల చేసే అధికారం లోహియా ఆటో ఇండస్ట్రీస్ లిమిటెడ్ యాజమాన్యానికి లేదని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి అన్నారు. లోహియా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు బుధవారం యూనియన్ తరపున లేఖలు పంపారు. ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. జివిఎంసిలో కాంట్రాక్టు టెండర్ విధానం లోపభూయిష్టంగా ఉందని, సమస్యలకు అధికారులే కారణం అని చెప్పారు. అధికారుల అవినీతి, అసమర్థత కారణంగా తరచూ మున్సిపల్ విధులకు, సేవలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. కాంట్రాక్టర్ల అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏకో ఆటోలు జివిఎంసికి చెందినవి అన్నారు. మ్యాన్ పవర్, మెయింటెనెన్స్ కోసం ఢిల్లీ లోహియా కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారన్నారు. డ్రైవర్ జీతం రూ.15 వేలకు కటింగులు పోను రూ.13 వేలు ఇవ్వాల్సి ఉండగా, ప్రతి నెలా బెదిరించి రూ.3 వేలు ఫోన్ పే ల ద్వారా తీసుకుంటున్నారని తెలిపారు. 14 నెలలుగా లూటీ చేస్తుంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. కమిషనర్‌గా పి.సంపత్ కుమార్ ఉన్నప్పుడు దీనిపై సిఐటియు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిందని, ఆధారాలను పరిశీలించి వెంటనే కార్మికులకు సెటిల్ చేయాలని సిఎంఒహెచ్, ఇంజినీరింగ్ అధికారుల సమక్షంలో ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. తీసుకున్న డబ్బు డబ్బు తిరిగి ఇవ్వలేదు సరి కదా మరలా అతనికే కాంట్రాక్ట్ ఇచ్చారని తెలిపారు. జివిఎంసి బిల్లులు చెల్లించలేదన్న కారణంతో ఈ నెల 15 నుండి వాహనాల తాళాలు డ్రైవర్లకు ఇవ్వకుండా, ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా పనులు నిలుపుదల చేశారన్నారు.

తక్కువ జీతానికి డ్యూటీ చేస్తానంటే కొనసాగిస్తానని, అందుకు సంతకాలు చేయాలని, లేనిచో జివిఎంసి ఆర్డర్ ఇచ్చినా సంతకాలు చేయని వారిని తీసుకోనని మేనేజర్ రవికిరణ్ కార్మికులను బెదిరిస్తున్నాడని తెలిపారు. ప్రస్తుత జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ కలుగజేసుకోవాలని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అక్రమాలకు పాల్పడుతున్న, చట్టాలు అమలు, రికార్డులను మైంటైన్ చేయని, సరైన లేబర్ లైసెన్స్‌లేని లోహియా కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరినట్లు చెప్పారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఎన్ఆర్ఐ మహిళ పోస్టుమార్టం నివేదిక

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి మేఘాలయ హోటల్లో ఈ నెల 6వ తేదీన జరిగిన ఎన్ఆర్ఐ మహిళ అనుమానాస్పద మృతి కేసులో పోస్టుమార్టం నివేదికను ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎఫ్ఎస్ఎల్)కు పంపించామని మూడో పట్టణ స్టేషన్ సిఐ పైడయ్య తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చినా మరికొన్ని అనుమానాల నివృత్తికి ఆర్ఎఫ్ఎస్ఎల్ విభాగానికి పంపించామని, ప్రస్తుతానికి దీనిని ఆత్మహత్య గానే పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వస్తే కేసు కొలిక్కి వస్తుందని భావించామని, కానీ ఆ నివేదికలో ఇంకా కొంత అస్పష్టత ఉందని తెలిపారు. ఈ కేసులో నిందితుడు ఎన్ఆర్ఐ డాక్టర్ శ్రీధర్‌ను ఇప్పటికే అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

వర్గీకరణలో రెల్లిలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి వర్గీకరణలో రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రెల్లి కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ న్యాయం చేస్తుందని రెల్లి కులస్తులందరూ టిడిపికి ఓటు వేశారని తెలిపారు. తెరపైకి ఎస్‌సి వర్గీకరణ వచ్చిందని, ఇందులో రెల్లి కులస్తులకు న్యాయం జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో, దశలవారీగా వివిధ పద్ధతుల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీ నుండి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామని చెప్పారు. అన్ని సంఘాలతో కలిపి జెఎసి ఏర్పాటు చేశామని తెలిపారు.

ఐపిఎల్ ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 24, 30వ తేదీల్లో విశాఖపట్టణం వేదికగా జరిగే ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ ల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రికెట్ క్రీడాకారులు బస, రవాణా తదితర ఏర్పాట్లపై జాగ్రత్తగా ఉండాలని, వారికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వీక్షకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, దీనిపై పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డిసిపిలు, ఎసిఎ, ఐపిఎల్, జివిఎంసి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణను స్వాగతిస్తున్నాం

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 15న షెడ్యూల్ కులాల వర్గీకరణపై రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పేర్కొన్నారు. విజెఎఫ్ ప్రెస్‌లో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్‌తో కలిసి బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ 59 ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్‌సి వర్గీకరణ జరగాలని చెప్పి 30 సంవత్సరాల నుండి ఉద్యమం చేస్తున్నారని గుర్తు చేశారు. రాజీవ్ రంజాన్ కమిషన్ 59 ఉప కులాలకు న్యాయం జరిగేలా స్పష్టమైన నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందించారని వెల్లడించారు. సమావేశంలో రుద్రపోగు సురేష్, పేరెల్లి ఎలీశా, ముమ్మిడివరపు చినసుబ్బయ్య, కింతాడ రాజశేఖర్, కొప్పుల వెంకట్రావు, కోట్ల కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ముందడుగుతో దేశాభివృద్ధి : సిపి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహిళల ముందడుగుతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశాఖ నగర సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ముందడుగు 9 న్యూస్ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఉమెన్స్ డే సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ, నేటి సమాజంలో జరుగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని మహిళలు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుంటే హక్కులను రక్షించడానికి తోడ్పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ ప్రతినిధి రమ, దయ హాస్పిటల్ ఫౌండర్ పద్మజ, జనసేన నాయకులు ఇనకోటి కొండలరావు, తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి రామ్, కార్యక్రమ నిర్వాహకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సింహాచలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం పరిశీలించారు. సుమారు రూ.54 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, క్యూ కాంప్లెక్స్, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

బహిరంగ నోటీసు

మహారాజశ్రీ పార్వతీపురం 2 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్ట్

IA.525/2023 OF OS.NO.3/2021

Between:

వడాల రామకృష్ణ రెడ్డి .... పిటిషనర్ వాది

And :

ఇనుమర్తి వెంకటేశ్వరావు మరియు వగైరాలు .....రెస్పాండెంట్స్/ప్రతివాదులు

R9: M/s. R.K. కన్స్ట్రక్షన్స్, దాని యజమాని శ్రీ గంట రామకృష్ణ, తండ్రి లేట్ అప్పలస్వామి, వయస్సు 43yrs. తన నివాసం నెంబర్ 7–18/4/1, ప్రశాంతి నగర్, పెందుర్తి టౌన్, GVMV, విశాఖపట్నం.

పై నెంబర్ దావా లో పిటిషనర్ వాది అయిన వడాల రామకృష్ణ రెడ్డి గారు పై నెంబర్ దావా ను మహారాజశ్రీ పార్వతీపురం 2 వ అదనపు జిల్లా బట్టి వారి కోర్ట్ లో ప్రతివాదులు 1 నుంచి 5 పైన స్పెసిఫిక్ పెర్ఫార్మన్స్ వగైరాలు పరిహారములు కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు దావాలో IA 525/2023 పిటిషన్‌లో UNDER ORDER I RULE 10 OF CPC పిటిషన్‌లో 9వ రెస్పాండెంట్స్‌గా పార్టీగా చేర్చియున్నం. సదరు దావా మరియు IA: 525/2023 పిటిషన్ **తేది 08.04.2025** నాటికి వాయిదా అయి వున్నది. కావున పైన పేర్కొన్న పిటిషన్ లో మీకు వాదన వున్నా యెడల మీ ప్రామాణికముల కౌంటర్ మరియు మీ వద్ద ఏమైనా వున్నా యెడల వాటితో సహా పై వాయిదా తేదీన, సదరు కోర్టు లో వ్యక్తిగతంగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు చేయవలసిందిగా మహారాజశ్రీ కోర్ట్‌వారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై పేర్కొనబడిన తేదీన హాజరు కాకుండా తప్పిపోయిన యెడల పరోక్ష మందు పై వాజ్యంను విమర్శ చేసి మహారాజశ్రీ కోర్ట్‌వారు తీర్మానం చేయడం అగునని కోర్ట్ వారి ఉత్తర్వులు ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్.వెంకట్రెడ్డి,
అడ్వకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా
సెల్: 9440592366

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 12 / 2023 in O.S.No. 21 / 2021

D.H.R. : చోడే శ్రీనివాసరావు

JDRS : ఉదయభాను సత్యవెంకట నాగలక్ష్మి

వేలం ప్రకటన

పైనెంబరు అమలు బాకీ రాబట్టుకొనే నిమిత్తం యిందలి JDRకు సంపూర్ణ హక్కులు కలిగిన యీ దిగువ షెడ్యూలు ఆస్తిని తే:01-04-2025 ఉదయం 10-30 గంటల లగాయతు పై కోర్టులో బహిరంగ వేలం జరుపబడునని తెలియజేయడమైనది. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు పై కోర్టులో హాజరయి వేలంలో పాల్గొనవలసినదిగా యీ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రస్తుతం అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్-రిజిస్ట్రీ, నర్సీపట్నం మున్సిపాలిటీ టౌన్, మరియు మండలం పెదబొడ్డేపల్లి గ్రామంలో శ్రీరామనగర్ కోలనీ మరియు సర్వేనెం. 52,46-3, 49-3బి డో.నెం. 8-8-326, అసెస్మెంట్ నెం. 1136003172, SCNo. 000184 గల RCCస్లాబుయిల్లు మరియు ఖాళీస్థలంకు కొలతలు మరియు హద్దులు

తూర్పు నుంచి పడమర : 33.00 అడుగుల లేదా 10.065 మీటర్లు

ఉత్తరం నుంచి దక్షిణానికి : 55.00 అడుగుల లేదా 16.775 మీటర్లు

మొత్తం స్థలం:202 చ॥గు॥ 168.872 చ॥మీ॥

తూర్పు: పట్నాయకుని సత్యనారాయణగారి స్థలం

దక్షిణం : నేమాల జగ్గారావుగారి యిల్లు స్థలం

పడమర: సుర్లజార్జీగారి యిల్లు స్థలం

ఉత్తరం : మున్సిపాలిటీ రోడ్డు

డి.హెచ్.ఆర్. విలువ : ఇవ్వలేదు.

జె.డి.ఆర్.విలువ : ఇవ్వలేదు.

అమీనా విలువ : రూ. 11,29,067/-

మార్కెట్ విలువ : రూ. 26,19,200/-

(బై ఆర్డర్)

ఎం.బి.కృష్ణారావు, అడ్వకేట్,
నర్సీపట్నం. సెల్: 9247729117

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి ఐదోవార్డులో రూ.12 లక్షలతో రోడ్లు, కాలువల అభివృద్ధి పనులకు బుధవారం కార్పొరేటర్ మొల్లి హేమలత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మారికవలసలో ఇప్పటికే రూ. 20 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మించామని, ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాల్లో రోడ్లు కాలువలు పనులు చేపడతామన్నారు..ఇప్పటికే వార్డులో రూ.13 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పనులు మొదలు పెట్టామన్నారు. దశలవారీగా వార్డు పరిధిలో రోడ్లు, కాలువలు, మెట్లమార్గాలు, ఇతర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్య దర్శి మొల్లి లక్ష్మణరావు, మాజీ కార్పొరేటర్ మాన్యాల సోం బాబు, ముచ్చి రామానాయుడు, జనసేన నేత దేవర శివ, రమణమ్మ ,రాజు,చంటి, సూరిబాబు రెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా దాసరి

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్ర చేనేత కుల కార్పొరేషన్, ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జివిఎంసి ఆరోవార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకిరంచారు, విజయవాడ గొల్లపూడిలో బిసి కార్పొరేషన్ భవనంలో కార్పొరేషన్ చైర్మన్ అబద్ధం, మేనేజింగ్ డైరెక్టర్, ఇతర అధికారులు స్టేట్ బోర్డు డైరెక్టర్స్‌రిసమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ, తమనకు ఇంత మంచిచక్కటి అవకాశం కలిగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.బిసి కులాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

జాతీయ బీమా పథకాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారి నాగార్జున

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 13వ వార్డు కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో బుధవారం పలు జాతీయ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన సదస్సులో కార్మిక విద్యాధికారి రెడ్డి నాగార్జున మాట్లాడుతూ ఈ శ్రమ కార్డు, ఆయుష్మాన్ హెల్త్ కార్డు ఉపయోగాలు. జాతీయ బీమా పథకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి శ్రమ యోగి మదన్ పెన్షన్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ధరణి సొసైటీ ప్రతినిధి బి.హరి, రామకృష్ణాపురం గ్రామ అధ్యక్షులు వంకర బాబూరావు, గౌరవ అధ్యక్షులు కాకర గోవిందు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

'గీతం'లో అత్యాధునిక దంత వైద్యం

'ప్రపంచ నోటి ఆరోగ్య సంరక్షణ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం దంత వైద్య కళాశాల, ఆసుపత్రిలో అన్ని వర్గాల ప్రజలకు అత్యాధునిక దంత వైద్యాన్ని అందిస్తూ, నోటిఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. ఏటా 30 వేల మందికి పైగా ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలను అందిస్తోంది. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ సందర్భంగా గీతం దంత వైద్యశాల, ఆసుప్రతిపై ప్రత్యేక కథనం.

సమాజానికి నైపుణ్యత కలిగిన వందలాది మంది దంత వైద్యులను అందించడంతో పాటు, నోటి ఆరోగ్యం సంరక్షణలో గీతం దంత కళాశాల, ఆసుపత్రి సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక్కడ 8 విభాగాల సమూహంగా వివిధ దంతవైద్యసేవలను అందిస్తు న్నారు. పెరియోడాంటిక్స్, ప్రోస్టో టాంటిక్స్, ఆర్థోడాంటిక్స్, కన్సర్వేటివ డెంటిస్ట్రి, ఓరల్, మాక్సిల్లోఫేషియల్ సర్జరీ వంటి పలు వైద్య విభాగాల ద్వారా నిపుణులు చికిత్సలు అందిస్తున్నారు. అధునాతన పరికరాలను ఉపయోగించి చిగుళ్ళ చికిత్స, దంతాల అమరిక, దంతాల పునర్నిర్మాణం, గ్రహణం మొర్రి చికిత్సలు, నోటి కేన్సర్ శస్త్ర చికిత్సలను గీతం దంత వైద్య కళాశాల విజయవంతంగా నిర్వహిస్తోంది.

గీతం దంత వైద్యశాల, కాలేజీ

దంతపరీక్షలు చేస్తున్న డాక్టర్

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వివి.నరసింహరావు నోటి ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, చక్కటి ఆహర అలవాట్లుతో పాటు దంతాలను శుభ్రం చేసుకోవడం, ధూమపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉండటం అవసరమన్నారు. గీతం దంత కళాశాల ఆసుపత్రి ఆధ్వర్యంలో సామాజిక దంత వైద్య విభాగం ద్వారా వివిధ ప్రాంతాలలో ఉచిత దంత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నోటి కేన్సర్‌కు ఇటీవల శస్త్ర చికిత్సలు అందించామన్నారు. దంత సంరక్షణలో యువత అప్రమత్తంగా ఉండాలని, ఫాస్ట్‌పుడ్‌లకు, శీతల పానీయాలకు అతిగా అలవాటు పడకూడదని సూచించారు.

3డి స్కానింగ్, జిర్కోనియా క్రౌనింగ్

దంత పరీక్షలలో కచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవడానికి వీలుగా దంతాలను 3డి స్కానింగ్ చేసే కోన్‌బీమ్ కంప్యూటెడ్ టోమోగ్రఫి సిస్టమ్స్ (సిబిసిటి)ను గీతం దంత కళాశాలలో నిపుణులు ఉపయోగిస్తున్నారు. కోన్ ఆకారపు ఎక్సరే బీమ్ ఉపయోగించి దంతాల సమాచారాన్ని అధునాతన పద్దతిలో పరిశీలించి చికిత్స అందిస్తున్నారు. దంతాలను సహజ సిద్ధంగా తయారు చేసి అందించడానకి జిర్కోనియా క్రౌనింగ్ విధానంలో క్యాడ్, కామ్ మిల్లింగ్ మిషన్ తొలిసారిగా ఉపయోగిస్తున్నట్లు గీతం దంత కళాశాల ఆసుపత్రి పర్యవేక్షక అధికారి డాక్టర్ నాగజ ప్రియ తెలిపారు.

వేములవలస గాంధీ మార్కెట్ ఆశీలు వేలం ఖరారు

ప్రజాశక్తి -అనందపురం : మండలంలోని వేములవలస మహాత్మాగాంధీ రోజువారి మార్కెట్ వేలం బుధవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద నిర్వహించారు. సీల్డ్ టెండర్ ఓపెన్ వేలం ద్వారా నిర్వహించారు. షీల్డ్ టెండర్ల ద్వారా పతివాడ పుష్పలత ఒక కోటి 39 లక్షలకు వేలాన్ని సొంతం చేసుకున్నారు. బహిరంగ వేలం పాటలో రెండో పాటదారుడు పతివాడ అప్పలరాజు రూ.1.37కోట్ల వరకు వేలం పాట వరకు వెళ్లారు. అనంతరం సీల్డ్ టెండరు ఓపెన్ చేయగా పతివాడ పుష్పలత ఒక కోటి 39 లక్షలు ఉండడంతో హెచ్చుపాటదారుడిగా ఖరారు చేశారు. వీటికి అదనంగా జిఎస్‌టి 18.5శాతం రూ.25,71,500 చెల్లించాల్సి ఉంటుందని డిపిఒ తెలిపారు. గత ఏడాది 9 నెలలకు రూ.కోటి 26 లక్షలకు వెన్ని శంకరరావు వేలం పాటదక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొనేందుకు రూ.22 లక్షలు ముందస్తు డిపాజిట్ చేయాల్సిన పరిస్థితుల్లో కేవలం ఇద్దరు మాత్రమే పాల్గొన్నారు

పలు సమస్యలపై డిపిఒకు వినతి

వేములవలస పూల మార్కెట్లో మౌలిక సదుపాయాలు సమకూర్చి సహకరించాలని పాటదారులు డిపిఒను కోరారు షెడ్లు లేకపోవడంతో రైతులు వ్యాపారస్తులు

వేలం పాటలో పాల్గొన్న డిపిఒ శ్రీనివాసరావు

ఇబ్బందులు పడుతున్నారని, వీటి పై చర్యలు తీసుకోవాలన్నారు మార్కెట్లోకి పశువులు చొరబడి కాయగూరలను ధ్వంసం చేస్తున్నాయని రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. రాత్రి 12 నుంచి తెల్లవారుజాము వరకు జరుగుతున్న పూల మార్కెట్ కు విద్యుత్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్లో స్థలం తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వెసులుబాటు కల్పించాలని కోరారు. దీనిపై డిపిఒ శ్రీనివాసరావు స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధరల పట్టికలు ఏర్పాటు చేసి ఆశీలు వసూలు చేయాలన్నారు. సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర రావు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, స్థానిక కార్యదర్శి రామకృష్ణ నాయుడు, శ్రీరామ్మూర్తి (బాబి) పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

భీమిలి, పద్మనాభం మండలాల్లో 75 శాతం వ్యాక్సినేషన్ పూర్తి

వ్యాక్సినేషన్ పర్యవేక్షిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ వెంకటరమణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : గాలికుంటు వ్యాధి నివారణకు నాలుగు మాసాలు దాటిన పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ విశాఖ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ మోపాడ చంద్రశేఖర్ పాడి రైతులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 31 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. బుధవారం మండలంలోని మూలకుద్దు, జివిఎంసి నాల్గో వార్డు నేరెళ్లవలస గ్రామాల్లో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను స్థానిక పశు సవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకటరమణతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ, భీమిలి, పద్మనాభం వెటర్నరీ ఆసుపత్రుల పరిధిలో 75 శాతం మేర పశువులకు టీకాలు వేసినట్లు వివరించారు. విశాఖ జిల్లా పరిధిలో 58,600 పశువులకు టీకాలు వేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 43,750 పశు వులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆరునెలలలోపు 3,400 ఆడ దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయాలన్నది లక్ష్యం కాగా 2,363 ఆడ దూడలకు టీకాలు వేసినట్లు తెలిపారు.

95 శాతం పశుగణన పూర్తి

విశాఖ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 95 శాతం పశు గణన పూర్తిచేసినట్లు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గతేడాది నవంబర్ ఒకటిన ప్రారంభమైన జాతీయ పశు గణన ప్రక్రియ, ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఐదేళ్ల కోసారి పశుగణన .జరుగుతుందన్నారు. ప్రస్తుతం భీమిలి డివిజన్ పరిధిలో 18, 355 గోజాతి ఆవులు, 8, 761 గేదెలు, 21,537 గొర్రెలు, 17, 818 మేకలు, 4 లక్షల 56 వేల 688 కోళు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో 41,549 గోజాతి ఆవులు, 25, 806 గేదెలు,46, 720 గొర్రెలు, 32, 477 మేకలు, 16 లక్షల 65 వేల కోళ్లు ఉన్నట్లు వివరించారు.

నేరాలు ఘోరాలు

వినియోగదారులను మోసపుచ్చిన తపాలా ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : వినియోగదారులను మోసం చేసిన కేసులో తపాలా శాఖ ఉద్యోగికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ప్రదీప్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలుపల్లి ఆదినారాయణ అందించిన వివరాలివి.

2019లో నగరంలోని కురుపాం మార్కెట్ దగ్గర తపాలా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వివి రమణమూర్తి, పలువురు చెల్లించిన సుకన్య సమృద్ధి యోజన డబ్బులను పాస్‌బుక్కుల్లో ఎంట్రీలు వేసినా,వారి ఖాతాలకు ఆన్‌లైన్‌లో జమ చేయలేదు. ఇలా రూ.51వేలను పక్కదారి పట్టించగా, కె. శ్యామసుందర్ అనే వ్యక్తి పోస్టర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేపట్టి రమణమూర్తి డబ్బులు స్వాహా చేసినట్లు గుర్తించారు. దీనిపై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై ఐపిసి 420, 409 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితునికి ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ఐదేళ్ల బాలికను లైంగికంగా వేధించిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ బుధవారం చిన్నపిల్లల లైంగిక వేధింపుల నిరోధక కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి (ఫోక్సో చట్టం) జి ఆనంద్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలివి. 2019. డిసెంబర్ 20న గాజువాక శ్రీనగర్ సుధా మెడికల్‌కు చెందిన ఎస్ గౌరీ శంకర్, అదే వీధిలో ఉంటున్న బాధిత బాలిక మూత్ర విసర్జన చేస్తుండగా, గోడదాటి వారింటి కాంపౌండ్‌లోకి వెళ్లిన నిందితుడు బాలిక ప్రైవేటు భాగాలను తాకుతుండగా, ఆమె కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రం దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నేరాభియోగాలు రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు

ప్రజాశక్తి -గాజువాక.: ఆస్తి పన్ను చెల్లించకుండా బకాయిలు ఉన్నవారిపై జివిఎంసి గాజువాక జోన్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం పలువురికి జప్తు నోటీసులు జారీ చేశారు. పన్ను వసూలులో భాగంగా జెడ్‌సి బుద్ధ రామ శేషాద్రి, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామనారాయణ, రెవిన్యూ ఆఫీసర్ ఎమ్. శ్రీకాంత్, ఆర్ఇ రెడ్డి మోహన్, అడ్మిన్స్ ఆధ్వర్యంలో గాజువాక బిసిలో రోడ్డులో పన్ను బకాయిదారులతో మాట్లాడి, నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లు, ఖాళీజాగాలకు పన్ను కట్టించారు. 63వ వార్డు బిసి రోడ్డులో ఇంటి పన్ను బకాయిదారుని కుళాయి కనెక్షన్ కట్ చేశారు.మెహర్‌నగర్ ఆర్య వైశ్య గురుమూర్తి, వాసవి కళ్యాణమండపం రూ. 7,07,084 ఆస్తి పన్ను బకాయి ఉండడంతో జప్తు నోటీసు జారీ చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత

ప్రజాశక్తి -ములగాడ : పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం కోరమండల్ గొల్లలపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత ఉందని, సంబంధిత కాంట్రాక్టర్లు పేదోడి ఆరోగ్యం గురించి ఆలోచించడం మానేశారని బిజెపి నాయకులు పెద్దరెడ్డి నానాజీ అన్నారు. ఆసుపత్రి నిర్వహణను కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా జివిఎంసి అధీనంలోనే కొనసాగాలనికోరారు. ఆసుపత్రిలో సిబ్బందికి నాలుగు నెలలుగా జీతభత్యాలు లేకున్నా ఇబ్బందులతో సేవలకు కొనసాగిస్తున్నారన్నారు. ఆసుపత్రి నిర్వహణకు ప్రయివేటు కాంట్రాక్టర్ అజమాయిషీలో ఉండడం వల్లే ఆసుపత్రి సిబ్బందికి, ఇక్కడకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మందుల కొరత, మొక్కుబడి వైద్యంతో నానాటికీ రోగుల సంఖ్య తగ్గిపోతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే, కొన్నాళ్లుకు రోగులు పూర్తిగా వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యాన్ని ప్రయివేటుకు ఇవ్వకుండా ప్రభుత్వ అజమాయిషీలో కొనసాగితే పేదలకు న్యాయం జరుగుతుందని, దీనిపై బిజెపి ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

శిక్షణలో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

ప్రజాశక్తి- సీతమ్మధార: జిల్లా మలేరియా అధికారిణి ఎం.తులసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు రేసపువానిపాలెంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (ఫిమేల్)లో రెండు రోజుల రీఓరియెంటేషన్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. జోనల్ మలేరియా అధికారిణి ఎం.శాంతిప్రభ, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ బి.సుజాత, ఎఎంఓ చిత్రాడ సత్యనారాయణ, విశ్రాంత ఎంపిహెచ్ఇవో కె.పాపారావు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించి ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. మైక్రోస్కోపులో మలేరియా లక్షణాలను ఎలా పరీక్షించాలి. పారాసైట్ స్టేజెస్ గుర్తింపు, స్లైడ్ టెక్నిక్, బ్లడ్ కాంపోనెంట్స్, మలేరియా జీవితచక్రం, దోమ జీవిత చక్రం, మైక్రో స్కోపు కాంపోనెంట్స్, మలేరియా చార్టుల నిర్వహణ, స్టెయిన్ ప్రిపరేషన్, మలేరియా పారాసైట్ ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సిఫేరం ఎలాగుర్తించాలి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రాక్టికల్‌గా మైక్రోస్కోప్‌లో చూపించి అవగాహన కల్పించారు. జిల్లాలోని యూపిహెచ్‌సిల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు శిక్షణలో పాల్గొన్నారు.

23న ప్రజా సంకల్ప వేదిక కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రజా సంకల్ప వేదిక జిల్లా, నియోజకవర్గ కమిటీలను ఈనెల 23న పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో నియమించనున్నట్లు స్టేట్ గ్రీవెన్స్ సెల్ వైస్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర రీజనల్ ఇన్‌ఛార్జి బంగార్రాజు తెలిపారు. నిస్వార్థంగా చట్ట పరిధిలో ప్రజలకు సేవ చేసే ప్రతి ఒక్కరూ అర్హులేనన్నారు. . ఇందులో తొమ్మిది రకాల కమిటీలు ఉంటాయని, హ్యూమన్ రైట్స్, గ్రీవెన్స్ సెల్, యాంటీ కరప్షన్, మీడియా అండ్ జర్నలిజం, ప్రజా చైతన్యం, న్యాయ విభాగం, సోషల్ మీడియా, మహిళా శిశు సాధికారిత, ఆర్‌టిఐ విభాగాల కమిటీల నియామకాలు చేపట్టనున్నారు. ఒక్కో కమిటీలో 20 మంది చొప్పున సభ్యులు ఉంటారు కమిటీలలో సభ్యులుగా చేరాలనుకునేవారు ఈనెల 23న పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి రావాలన్నారు.

ఆత్మకూరి శంకరరావుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకరరావు 13వ వర్ధంతిని నిర్వహించారు. వేపగుంట ఆసుపత్రిలోని శంకరరావు విగ్రహానికి శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకు పూలమాల వేసి, పుష్ప గుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా శంకర రావు నిస్వార్థత, దాతృత్వాన్ని స్మరించుకుని ఆయన సేవలను కొనియాడారు. ఫౌండేషన్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డాక్టర్ టి. రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ నజీన్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ అజయ్ శర్మ, డాక్టర్ చల్లా, డాక్టర్ శిరీష, గౌరవ సలహాదారు టి. సత్యనారాయణ, డిజిఎం (పిఆర్) కె. బంగార్రాజు, , ఎజిఎం (హెచ్ఆర్) ఎస్.కె.ఎల్. రావు విభాగాధిపతులు, ఉద్యోగులు ఉన్నారు.

స్వీయరక్షణపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : మహిళా భద్రతపై ఫైడా మహిళా కళాశాల, ప్రిజం కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బుధవారం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 300 మంది విద్యార్థినులకు స్వీయరక్షణపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ప్రత్యేకతలు తెలియజేసి, విద్యార్థినులకు యాప్ డౌన్‌లోడ్ చేసి, దాన్ని వినియోగించడంపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు ఆత్మరక్షణ శిక్షణా శిబిరాన్ని నిర్వహించి, ప్రొఫెషనల్ కరాటే కోచ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు కీలకమైన రక్షణా పద్ధతులు, వ్యూహాలు నేర్పించారు.

పోర్టు ఆసుపత్రి రీటెండర్లను రద్దు చేయాలి

170వ రోజుకు చేరిన రిలే దీక్షలు

దీక్షాశిబిరంలో నినాదాలు చేస్తున్న పోర్టు ఉద్యోగులు, కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రయివేటుకు కట్టబెట్టేందుకు పిలిచిన రీటెండర్లను తక్షణమే రద్దు చేయాలని పోర్టు యూనియన్ నాయకులు బి జగన్ డిమాండ్ చేశారు పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆసుపత్రి వద్ద ఉద్యోగులు, కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు బుధవారం 170వ రోజుకు చేరుకున్నాయి.

ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రిని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో అభివృద్ధి పేరుతో రీటెండర్‌ను పిలిచి, వచ్చేనెల 21న టెండర్లు ఓపెన్ చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపడుతోందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు 40వేల మంది ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు కుటుంబాల ఆరోగ్యభద్రతను ప్రమాదంలోకి నెడుతున్న ఘోర నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. పోర్టు ఆసుపత్రి నిర్వహణ ప్రయివేటుకు ఇస్తే వైద్యం ఖరీదౌతుందని, దాన్ని భరించే పరిస్థితి పోర్టు కార్మికులు, పెన్షనర్లకు ఉండదన్నారు.

పిపిపి ముసుగులో పోర్టు ఆసుపత్రికి చెందిన ఏడు ఎకరాల విలువైన భూములను ప్రయివేటుకు ధారాదత్తం చేసే కుట్ర జరుగుతుందన్నారు. రీటెండర్ ప్రక్రియను వెంటనే రద్దు చేసి, పోర్టు యాజమాన్యం సొంత నిధులతో ఆసుపత్రిని అధునాతన వైద్యపరికరాలను సమకూర్చి, అభివృద్ధి చేసి నిర్వహించాలని, నిపుణులైన వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు అవసరమైన మందులను సమకూర్చి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ, జె సత్యనారాయణ, సిహెచ్ తిరునాధరావు నర్సింగరావు నాయుడు రాఘవులు, కెవిఎస్ కుమార్, శ్రీనివాసు పాల్గొన్నారు

అర్చక టోర్నీ క్రికెట్ విజేత సంతోష్ గాయత్రి జట్టు

విజేతగా నిలిచిన సంతోష్ గాయత్రి జట్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : బాలభాను అర్చక పురోహిత సంఘం క్రికెట్ టోర్నీ విజేతగా సంతోష్ గాయత్రి జట్టు నిలిచింది. బుధవారం కైలాసగిరి పోలీస్ రిజర్వ్ మైదానంలో నిర్వహించిన ఫైనల్‌లో సురేష్ గాయత్రి జట్టుపై సంతోష్ గాయత్రి విజయం సాధించింది. నిర్ణీత 10 ఓవర్లలో సురేష్ గాయత్రి, సంతోష్ గాయత్రి జట్టు 68 పరుగులు చేశాయి. దీంతో సూపర్ ఓవర్ నిర్వహించారు.

సురేష్ గాయత్రి జట్టు నాలుగు పరుగులు చేయగా, సంతోష్ గాయత్రి జట్టు 5 పరుగులు చేసి విజేతగా నిలిచింది. నగరంలో తొలిసారిగా అర్చక పురోహితులను జట్లుగా విభజించి ఈ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం ప్రారంభ మ్యాచ్‌ను సాంప్రదాయ దుస్తులతో క్రీడాకారులు ఆడారు. నిత్యం అనేక ఒత్తిడిలను ఎదుర్కొంటున్న అర్చక పురోహితుల మానసిక ఉల్లాసానికి ఈ టోర్నమెంట్ ఎంతగానో దోహదపడుతోందని సంఘం అధ్యక్ష కార్యదర్శులు జోష్యుల కామేశ్వర శర్మ, మావుడూరు కిషోర్ కుమార్ శర్మ తెలిపారు.

హాస్టల్ భవనానికి రూ.4.50 కోట్లు మంజూరు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి రెండో వార్డు కుమ్మరిపాలెంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం కొత్త భవన నిర్మాణానికి రూ 4.50 కోట్లు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ డైట్ జంక్షన్‌లో ఉన్న వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో, ఎగువపేట వార్డు సచివాలయం భవనం మేడపై రాత్రి వేళ విద్యార్థులు నిద్రిస్తున్నారన్నారు. హాస్టల్ దుస్థితిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయ స్వామికి లేఖ ద్వారా తెలియజేసి, నిధులు మంజూరు చేయాలని కోరానని, మంత్రి స్పందించి మంత్రి నిధులు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే గంటా కృతజ్ఞతలు తెలిపారు.నిధులు మంజూరైన క్రమంలో త్వరితగతిన హాస్టల్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

టెన్త్ హిందీ పరీక్షలకు 74మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ఆరిలోవ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం రెండవ రోజు సెకెండ్ లాగ్వేజ్ హిందీ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. హిందీ పరీక్షకు 28,376 మందికిగాను, 28,302 మంది హాజరయ్యారు. 74 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. జిల్లా పర్యవేక్షణాధికారి దేవానందరెడ్డి ఐదు సెంటర్లు, తాను 10 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 38 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు డిఇఒ తెలిపారు. ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షల్లో 15 కేంద్రాల్లో ఇంగ్లీషు పరీక్ష జరగగా 698 మందికి గాను 622 మంది విద్యార్థులు హాజరయ్యారు. 76 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని డిఇఒ తెలిపారు.

ఐపిఎల్ మ్యాచ్ రోజుల్లో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి -మధురవాడ : ఐపిఎల్‌లో భాగంగా ఈనెల 24, 30 తేదీల్లో పిఎం పాలెం ఎసిఎ విడిసిఎం స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లున్న నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్‌పై పోలీసులు ఆంక్షలు విధించారు. 24న ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జైయింట్స్, 30నఢిల్లీ క్యాపిటల్స్ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు మధ్య ఐపిఎల్‌పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చిపోయే వాహనాలు ఏయే మార్గాల్లో మళ్లిపోవాలో ట్రాఫిక్ పోలీసులు సూచనలు చేశారు. విశాఖ నగరానికి శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చిపోయే బస్సులు, కారులు, ఇతర వాహనాలకు వేర్వేరుగా రూట్‌లను ఏర్పాటుచేసి, ఆయా మార్గాల్లోనే రాకపోకలు సాగించాలని సూచనలు చేశారు. అలాగే స్టేడియంలో మ్యాచ్ తిలకించేందుకు వచ్చేవారి వాహనాల పార్కింగ్‌కు కూడా వేర్వేరుగా ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌తో సంబంధం లేని వారంతా ఆయా మార్గాల్లో ప్రయాణించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా సహకరించాలని కోరారు.

అప్రకటిత విద్యుత్‌కోతతో ఇబ్బందులు

ప్రజాశక్తి -ఆనందపురం : పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సమయంలో అప్రకటిత విద్యుత్ కోతతో టెన్త్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వేములవలస గ్రామంలో మంగళవారం తరచూ విద్యుత్ కోతతో ప్రజలు, విద్యార్థులు అసహనానికి గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేకసార్లు విద్యుత్ వచ్చి పోతుండడంతోపాటు రాత్రి ఏడుగంటలు దాటే వరకు విద్యుత్ సరఫరా రాకపోవడంతో విద్యార్థులు, వ్యాపారులు ఇక్కట్లు పడ్డారు. ఒకవైపు ఎండలు మండుతూ, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితుల్లో ఇలా విద్యుత్ కోత ఇబ్బందులకు గురిచేసింది. విద్యుత్ కోత ఉంటే ఇప్పటివరకు ముందస్తుగా సమాచారమిచ్చే అధికారులు, ఇపుడు అప్రకటితంగా విద్యుత్ కోత విధించడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. టెన్త్ పరీక్షలతోపాటు ఎండలు మండుతున్న పరిస్థితుల్లో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ముందుకు సాగుదాం

గాజువాకలో నివాళులర్పిస్తున్న సత్యవతి, ఐద్వా నేతలు

ఐద్వా ఆధ్వర్యాన ఘననివాళి

ప్రజాశక్తి -గాజువాక : మల్లు స్వరాజ్యం ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి సత్యవతి అన్నారు. బుధవారం శ్రీనగర్‌లో మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా, పేదలు, రైతు సమస్యలపై చిన్నతనం నుంచే ఆమె చేసిన సేవలను కొనియాడారు. మల్లుస్వరాజ్యం స్ఫూర్తితో ఐద్వా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు, మానస, సునీత, పుష్ప, జి మని, దేవుడమ్మ, వందన, గీత, పాల్గొన్నారు.

వేపగుంట : అప్పల నరసయ్య కాలనీ, కార్మిక నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకురాలు బి రమణి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నాయకురాలిగా, ఎన్నో ప్రజా ఉద్యమాలు చేసిన స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.కార్యక్రమంలో ఈశ్వరమ్మ, పార్వతి, కుమారి, పూర్ణిమ పాల్గొన్నారు

ములగాడ : 58వ వార్డు గుల్లలపాలెంలో మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతిని ఐద్వా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్షురాలు బి. మమత పూలమాల వేసి నివాళులర్పించారు ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్. విమల మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకారులను గడగడలాడించి, తుదిశ్వాస విడిచే వరకు పేదలు, మహిళల పక్షాన స్వరాజ్యం పోరాడాలని కొనియాడారు. గుల్లలపాలెం ఏరియా అధ్యక్ష కార్యదర్శులు పి అరుణ, కె.కృష్ణవేణి ఐద్వా నాయకురాలు పి వరలక్ష్మి, ఈశ్వరమ్మ, నర్సు బాయ్, నిర్మల, పోలమ్మ, గిరిజ పాల్గొన్నారు.

వేపగుంటలో నివాళులర్పిస్తున్న రమణి, ఇతర నేతలు

మల్లు స్వరాజ్యానికి మల్కాపురంలో ఐద్వా నేతల నివాళి

హత్యకు గురైన

హిజ్రా శరీర భాగాలు గుర్తింపు

నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు

ప్రజాశక్తి-కశింకోట

హత్యకు గురైన హిజ్రా దీపు మృతి శరీర భాగాలను గుర్తించినట్లు కశింకోట సిఐ స్వామినాయుడు బుధవారం తెలిపారు. కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని బయ్యవరం బ్రిడ్జి వద్ద మంగళవారం హిజ్రా మృత శరీర భాగం లభ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పి ఆదేశాలు మేరకు కశింకోట బయ్యవరం బ్రిడ్జి కింద దొరికిన రెండు కాళ్లు, కుడి చేయికి సంబంధించిన మిగిలిన శరీరాల భాగాలు కోసం వెతకగా, తల భాగం, ఎడమ చేయి అనకాపల్లి డైట్ కాలేజీ హైవే పక్కన సర్వీస్ రోడ్డు కాలువలోనూ, మొండెం భాగం తాళ్లపాలెం హైవే బ్రిడ్జి కింద కాలువలో సంచిలో దొరికిందని తెలిపారు. మృతి చెందిన వ్యక్తి అనకాపల్లి మద్రాసు నాయకుల వీధికి చెందిన మైపల దిలీప్ శివ శంకర్ (దీపు)గా గుర్తించడం జరిగిందని చెప్పారు. సదరు హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నామని, నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఆరా.....

అనకాపల్లి : అనకాపల్లిలో హిజ్రా దారుణ హత్య విషయం తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్పీకి ఫోన్ చేసి దర్యాప్తు ముమ్మరం చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదేశించినట్లు పోలీస్ వర్గాలు చెబుతున్నాయి.

హిజ్రా మృతదేహంలో ఒక భాగాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిందితులను కఠినంగా శిక్షించాలని హిజ్రాల నిరసన

నిందితులను శిక్షించాలని ఎన్‌టిఆర్ ఆసుపత్రి వద్ద సిఐని కోరుతున్న హిజ్రాలు, హిజ్రా దీపు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-అనకాపల్లి : హిజ్రా దీపు హత్యపై బుధవారం ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద హిజ్రాలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. దీనికి ముందు నెహ్రూ చౌక్ జంక్షన్ నుండి నుంచి డిఎస్‌పి కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలియజేశారు. నిందితులను దిశ చట్టం కింద శిక్షించాలని, లేదా నడిరోడ్డుపై ఎన్కౌంటర్ చేయాలని పోలీసులను హిజ్రాలు డిమాండ్ చేశారు. నిందితుడుగా భావిస్తున్న బన్నీ ఫోటోను చెప్పులతో కొట్టి కాళ్లతో తొక్కి తమ ఆగ్రహాన్ని తెలియజేశారు. తాము కుటుంబానికి, సమాజానికి దూరంగా ఉంటూ పోషణ కోసం ఇటువంటి వృత్తి చేసుకుంటున్న తమను కొంతమంది యువకులు ప్రేమ పేరుతో మోసగించి ఇటువంటి చర్యలకు పాల్పడడం దారుణమని హిజ్రాలు కన్నీటిపర్యంతమన్నారు. నాలుగు సంవత్సరాలుగా దీపుతో సహజీవనం చేసిన బన్నీని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళకు ఇటువంటి సంఘటనలో ఎటువంటి న్యాయం జరుగుతుందో అటువంటి న్యాయం చేయాలని కోరారు.

హిజ్రాలపై తరచూ దాడులు

మహిళలపైనే కాకుండా తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ సమాజ ఆదరణకు దూరమైన హిజ్రాలపై కూడా హత్యలు, అఘాయిత్యాలు, దాడులు జరగడంతో సమాజం ఏ దిశగా వెళ్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనకాపల్లిలో హిజ్రాలపై దాడులు పరిపాటిగా మారాయి. గత ఐదారేళ్లలో చూస్తే దేవుడమ్మ అనే హిజ్రాను పెట్రోల్ పోసి తగలబెట్టడం, చిత్రమ్మ అనే హిజ్రాను తలనరికి ట్రైన్ కింద పడవేయడం, మరో హిజ్రాను యాసిడ్ పోసి అంధవికారంగా చేయడం చేశారు. తాజాగా మంగళవారం జరిగిన సంఘటన మరింత హృదయ విదారకంగా ఉంది. ఏకంగా హిజ్రా దీపును మూడు ముక్కలుగా చేసి మూడు చోట్ల పడవేయడం మరింత ఆందోళనకరంగా మారింది. అనకాపల్లిలో ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

ఐద్వా నిరసన

అనకాపల్లి : అనకాపల్లిలో హిజ్రా హత్యపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి మాట్లాడుతూ అనకాపల్లి గవరపాలెం బోయ వీధికి చెందిన దీపు అనే హిజ్రా అతి కిరాతకంగా హత్యకు గురైందని తెలిపారు. ఇలాంటి దారుణ ఘటనలు రోజురోజుకీ పెరుగుతూనే ఉన్నాయన్నారు. ఆడపిల్లలకు, చిన్నారులకు, మహిళలకు రక్షణ లేకపోగా, హిజ్రాలకు కూడా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం మంత్రి సొంత జిల్లాలోనే ఇటువంటి దారుణ ఘటనలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే నిందితులను పట్టుకొని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, కమిటీ సభ్యులు గాయత్రి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

గదబపాలెం ఆదివాసీల సాగు హక్కులను కాపాడాలి

వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని గదబపాలెం ఆదివాసీల సాగుహక్కులను కాపాలని కోరుతూ సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ లిబరేషన్, దళిత సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గొలుగొండ మండలం, పాత మల్లంపేట గ్రామం, సర్వేనెంబర్ 850-1లోని మెట్టు భూముల్లో ఆదివాసీలు గత 50 సంవత్సరాలుగా సాగు అనుభవంలో ఉన్నారని తెలిపారు. ఈ భూమికి ప్రస్తుత గొలుగొండ మండలం తహశీల్దారు ఎలాంటి చట్టబద్ధమైన ప్రక్రియలు పాటించకుండా, గుట్టు చప్పుడు కాకుండా, 50 ఏళ్ల కిందట దేశం వదిలి అమెరికా వెళ్ళిపోయి, భారతదేశ పౌరసత్వాన్ని వదులుకొని అమెరికన్ పౌరునిగా మారిపోయిన దుగ్గిరాల బాలకృష్ణ సాగు అనుభవంలో ఉన్నట్టుగా తప్పుడు నివేదికలు సృష్టించి భూమి రికార్డును మార్పుచేశారని తెలిపారు. సాగు అనుభవంలో ఆదివాసీలు ఉన్నారని 2023 జనవరి 3వ తేదీన అప్పటి రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ జిల్లా కలెక్టర్‌కి రాసిన నివేదికలలో అంగీకరించారని పేర్కొన్నారు. 2024 డిసెంబర్ 13న పాత మల్లంపేటలో జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆదివాసీలు వినతి పత్రాలు ఇచ్చారని, అయినా ఆదివాసీల సాగులో లేనట్టు, అమెరికాలో స్థిరపడిన దుగ్గిరాల బాలకృష్ణ సాగులో ఉన్నట్టు చూపించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి అవినీతికి పాల్పడి చట్ట విరుద్ధంగా రికార్డు మార్చిన రెవెన్యూ అధికారులపై విజిలెన్స్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగారు రావ్, సిపిఐ జిల్లా నాయకులు రాజాన దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రుత్తల శంకరరావు, దళిత సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, వివిధ మండలాల నుండి వచ్చిన ఆదివాసీ యువకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల్లో పనిచేస్తున్న అధికారులు ఉద్యోగులు మార్చి 24, 25 తేదీలలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిఐటియు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మద్దతు ప్రకటిస్తూ ముద్రించిన గోడ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకర్రావు, జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. ప్రభుత్వం కొత్తగా భర్తీ చేసి ఉద్యోగాలను అవుట్సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలిక ఉద్యోగులుగా నియమించాలని ప్రయత్నిస్తుందని, బ్యాంకుల సంఖ్యను తగ్గించి ఉద్యోగులపై పనిభారం విపరీతంగా పెంచుతుందని తెలిపారు. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల అప్పులు మాఫీ చేస్తూ బ్యాంకుల నెత్తిన భారాలు మోపుతుందని, వీటికి నిరసనగా బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఖాళీలను భర్తీ చేయాలని, టెంపరరీలను రెగ్యులరైజ్ చేయాలని, ద్వైపాక్షిక ఒప్పందాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖ ఆదేశాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అంతా ఐక్యమై ప్రభుత్వ కుట్రలను వెనక్కి నెట్టడమే మార్గమని, ఈ బాటలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఒక మైలు రాయి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎప్పటికప్పుడు వస్తున్న నూతన సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకొని పనితీరు మెరుగుపరచుకోవాలని ఎపి విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి విఎస్ఆర్‌కె గణపతి అన్నారు. యూనియన్ సర్వసభ సమావేశం వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ హాల్లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. యూనియన్ ద్వారా ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వాటిని త్వరగా భర్తీ చేయాలని కోరారు. అనంతరం సభ్యులందరూ యూనియన్ అనకాపల్లి బ్రాంచ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గణపతితో పాటు రీజినల్ సెక్రెటరీ ఎస్.చిరంజీవి పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షులుగా పడాల సోమన్న దొర, సెక్రటరీగా అనకాపల్లి నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరుప వెంకట రాంబాబు ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఓ.శ్రీనివాసరావు, సిహెచ్.వి.సత్యనారాయణ, ఆఫీస్ సెక్రటరీగా సిహెచ్‌వివి కుమార్, కోశాధికారిగా వెంపల శంకరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కరణం ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు చవితిని నర్సింగరావు, పి.కుంచుబాబు పాల్గొన్నారు.

20న సచివాలయ హెల్త్ సెక్రటరీల ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సచివాలయాల హెల్త్ సెక్రటరీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 20న జరిగే రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయాలని యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జగన్మోహన్రావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్త్ సెక్రటరీలకు వైద్య, ఆరోగ్యశాఖ పనులు మాత్రమే అప్పగించాలని, పూర్తిగా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోకి తేవాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరుతూ 20న విజయవాడ అలంకార్ సెంటర్, ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయ హెల్త్ సెక్రెటరీలందరూ పాల్గొని దీనిని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుండి సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఈ నెల 20 నుండి 29వ తేది వరకు మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో ఏడాది పాటు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు జరుగునని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాజిక తనిఖీలను పారదర్శంగా నిర్వహించాలని ఎస్ఆర్పిలు, డిఆర్పిలకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి ప్రభ శ్రీనివాస్, ఎస్ఆర్పి డి.రాజేంద్ర, ఏపిఓ, వరహాలు బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, 9 మంది డిఆర్పిలకు, ఎంపిడిఓ సిబ్బంది పాల్గొన్నారు.

పూత దశలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : నువ్వు పంట పూత దశలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వప్న అన్నారు. మండలంలోని తాళ్ళ పాలెంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో భూ ఆధార్ నమోదు పరిశీలించారు. గ్రామ భూ సహాయకులు సన్యాసి నాయడు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

చీడపీడల నివారణకు జిగురు అట్టలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రైతులు వరి పంటలో చీడ పీడల నివారణకు జిగురు అట్టలు వినియోగించాలని శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల కింజరావు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. బుచ్చయ్య పేట మండలం పి. భీమవరంలో కొండెం పూడి కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజ్ కుమార్, టిటిటి డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో గ్రామీణ వ్యవసాయం పని అవగాహన, అనుభవం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు చీడపీడల పై అవగాహన కల్పించారు. రైతులు సులభంగా ఇంట్లో ఆముదం, తుమ్మ జిగురుతో అట్టలు తయారు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు డి.ప్రసన్న, హరిప్రియ, హేమలత, మమత, ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఇజిఎస్ నిధులు విడుదల

ప్రజాశక్తి-కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో 44 ఎన్ఆర్ఇజిఎస్ పనులకు రూ.2,05,90,000 విడుదలైనట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కె.కోటపాడు మండలం గవరపాలెంలో ఐదు పనులకు రూ.25.7 లక్షలు, పాతవలసలో రెండు పనులకు రూ.40 లక్షలు, దాలివలసకి రూ.20.20 లక్షలు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాడుగుల మండలం మాడుగుల గ్రామంలో 13 పనులకు రూ.58 లక్షలు, పంగలపాక 14 పనులకు రూ.40 లక్షలు, విజయపురంలో 9 పనులకు రూ.22 లక్షలు ఖర్చు చేస్తామని తెలిపారు.

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు సిఐటియు ఆధ్వర్యాన పని ప్రదేశంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కూలీల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమ్మర్ అలవెన్సులు, పనిముట్లు అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోలిరెడ్డి అప్పారావు, ఏ వరలక్ష్మి, మణి, పార్వతి, ఉమా, అప్పల నరసింహ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి లక్ష్మీదేవిపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని కోరుతూ బుధవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ వద్ద నిరసన తెలిపారు. 20 సంవత్సరాలగా బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రజలను ఊరిస్తున్నాయని, కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయిందని పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం జరగకపోవడంతో భారీ వాహనాలు పట్టణంలో ప్రయాణించడం ద్వారా పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు, బొట్టా చిన్నియాదవ్, బొడ్డు సోమరాజు, ఆడారి బుచ్చిరాం, కొల్లి చిన్న అప్పారావు, చెవ్వేటి అప్పారావు, గంపల చినరాజు, అమలకంటి శంకర్, మాన్యం బాబ్జీదొర, గణేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దొప్పర్ల గ్రామంలో మురుగు కాలువలు నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన కొల్లి నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీలు సరిగా లేక రోజుల తరబడి మురుగునీరు ప్రవహించక పోవడంతో దుర్గంధం వెదజల్లుతూ దోమల పెరిగి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోయారు. దీనిపై గతంలో పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదని తెలిపారు.

రసాయన పరిశ్రమలలో రక్షణ వ్యవస్థలను నిత్యం పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రసాయన కర్మాగారాలలోపల, వెలుపల కూడా రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలని, వాటిని నిత్యం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టరు, జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ చైర్పన్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫ్యాక్టరీలలో ఏర్పాటుచేసిన రక్షణ వ్యవస్థల గూర్చి సమీక్ష చేశారు. ఫ్యాక్టరీ లోపల, వెలుపల కూడా రసాయనాలు లీకేజీలను గుర్తించే సెన్సార్లను అమర్చాలని సూచించారు. ప్యాక్టరీలలో అమర్చిన రక్షణ పరికరాలకు జాతీయ సెఫ్ట్ కౌన్సిల్ ఆమోదం ఉండాలన్నారు. ఫ్యాక్టరీ వెలుపల ప్రమాదాలకు సంబంధించిన రక్షణ వ్యవస్థల నివేదికలను 20 రోజులలో అందజేయాలని ఆదేశించారు. కంపెనీలలో శిక్షణ పొందిన కార్మికులనే నియమించు కోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డిఒ షేక్ ఆయిషా, ఫ్యాక్టరీల జాయింటు చీఫ్ ఇనస్పెక్టరు జె.శివశంకర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టరు జి.వి.ఎస్.ఎస్. నారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో జీవ కారుణ్య క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లా జీవ కారుణ్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జంతువుల పట్ల దయాగుణం కలిగేలా చిన్నతనం నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలని, అందుకు ప్రతి ఉన్నత పాఠశాలల్లో జీవ కారుణ్య క్లబ్ ఏర్పాటు చేయాలని కోరారు. మునిసిపాలిటీ, మండల కేంద్రాలలో వీధికుక్కలకు పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించాలని, వాక్సినేషను చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఒ పి.నారాయణమూర్తి, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి బి.రామమోహనరావు, జిల్లా పంచాయితీ అధికారి ఆర్.శిరీషారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు జెవివిఎస్.రాజశేఖర్, పి.శ్రీదేవి, ఎల్.సత్యనారాయణ, కె.బెన్నినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, వివిధ శాఖల అధికారులు

నిబంధనలు పాటించని క్వారీ వాహనాలు సీజ్

నిబంధనలు పాటించని రాయి రవాణా చేసే క్వారీ వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ హెచ్చరించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలో బుధవారం అధికారులు, క్వారీలు, లారీల యజమానుల అసోసియేషన్లతో రోడ్డు ప్రమాదాలపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్వారీ లారీల వల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, అధిక లోడుతో వెళ్లి రైల్వే అండర్ బ్రిడ్జి ఢీకొనడం వలన రైల్లు రాకపోకలకు అంతరాయం కలిగిందని తెలిపారు. ఇకముందు ఇటువంటివి జరిగితే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్వారీ లారీలు పట్టణంలోకి ప్రవేశించకుండా వారికి నిర్దేశించిన మార్గంలో మాత్రమే రవాణా చేయాలని సూచించారు. అనుమతి లేని మైనింగుపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని గనులశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, ఆర్డిఒ షేక్ ఆయిషా, డిఎస్పి వి.మోహనరావు, జిల్లా రవాణా అధికారి మనోహర్, పంచాయితీ రాజ్ ఇఇ కెవి.నాయుడు, మైన్స్ అండ్ జియోలజీ సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, రెవిన్యూ, విజిలెన్స్, పోలీసు, రవాణాశాఖ అధికారులు క్వారీలు, లారీల యజమానుల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించుకోవాలి

జిల్లాలోని చిత్తడి నేలలను పరిరక్షించుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం 'చిత్తడి భూముల పరిరక్షణ, నిర్వాహణ' అనే అంశంపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) నివేదిక ప్రకారం జిల్లాలో 951 చోట్ల చిత్తడి నేలలున్నాయని, వాటిలో సహజంగా ఏర్పడిన జలాశయులు ఎన్ని ఉన్నాయి, మండలాల వారీగా చిత్తడి నేలల డేటాను సేకరించి నివేదిక ఇవ్వాలని డిఎఫ్ఒను ఆదేశించారు. ఈ సమావేశంలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డిఓలు షేక్ ఆయిషా, వి.రమణ, జిల్లా అటవీశాఖ అధికారి ఎం.సామ్యూల్, జిల్లా ఉప అటవీ శాఖ అధికారి ఎ.సునీల్ కుమార్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా సర్వే సహాయ సంచాలకులు ఎస్ రాజా గోపాల్, అనకాపల్లి ట్రాఫిక్ డిఎస్పీ వి.మోహన్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు, ఫారెస్ట్ రేంజర్లు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ హాకీ ఉమెన్ కోచింగ్‌కు మేరీ ఎంపిక

ప్రజాశక్తి-యలమంచిలి : ఇంటర్నేషనల్ హాకీ టోర్నమెంట్ కోసం దేశంలో 65 మంది సీనియర్ హాకీ మహిళా క్రీడాకారుల్ని ఎంపిక చేశారని, అందులో యలమంచిలి క్రీడాకారిణి లొట్ల మేరీ కూడా ఉన్నారని అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి నరేష్ బుధవారం తెలిపారు. వారికి బెంగుళూరులో ఈ నెల 23 నుండి 30 వరకు శిక్షణ ఇస్తారని, ఆ క్యాంపునకు ఎంపికైన క్రీడాకారుల్లో 40 మందిని తుదిగా ఎంపిక చేసి ప్యూచర్ కోచింగ్ ఫర్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్ తర్ఫీదునిస్తారని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో 21 ఏప్రిల్ నుండి 5 మే వరకు జరుగు అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక చేస్తారన్నారు. జిల్లా నుండి మేరీ ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి సంతోషం వ్యక్తం చేశారు. మేరీకి ఇండియన్ టీమ్‌లో చోటు లభించాలని అనకాపల్లి జిల్లా హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేశ్, రమేష్, రాంబాబు, మహేష్, సాయి తదితరులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కెజిబివిల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశానికి ఈనెల 22 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కె.కోటపాడు కేజీబీవీ ప్రిన్సిపాల్ చిన్నమ్మలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి కేజీబీవీలో 7, 11 తరగతులలో ప్రవేశాల కోసం, అలాగే 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ కోసం బాలికల నుండి ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాధలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద బిసి, ఎస్సీ, ఎస్టి, మైనార్టీ, బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని, సంబంధిత పాఠశాలల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చునని ఆమె తెలిపారు.

పిఎస్.పేట మార్గంలో వాహనాల రాకపోకలు నిలుపుదల

ప్రజాశక్తి-చోడవరం : పిఎస్ పేట- చోడవరం మార్గంలో గురువారం నుండి సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేయనున్న నేపథ్యంలో 20 రోజులపాటు ఈ మార్గంలో వాహన రాకపోకలు నిలుపుదల చేయనున్నట్లు మండల జెఇ శాంతారాం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిఎస్ పేట నుండి వచ్చే వాహనదారులు అంకుపాలెం మీదుగా చోడవరం చేరుకోవాలని, చోడవరం నుండి వెళ్లే వాహనాలు పొదచారులు అదే రోడ్డు కుండా రాకపోకలు సాగించాలని సూచించారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

వెంకన్న హుండీలో బంగారం కానుకలపై క్లారిటీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది వెంకటేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన వెండి, బంగారు ఆభరణాల కానుకలను బుధవారం లెక్కించారు వడ్డాది వెంకన్న హుండీ లెక్కింపులో మాయ అనే శీర్షిక బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈవో టిఎన్ఎస్ శర్మ, ధర్మకర్త దొండా కన్నబాబు, గ్రామ పెద్దలు సమక్షంలో హుండీలలో భక్తులు వేసిన ముడుపులను తెరిచారు. ఈ ఏడాది ఉత్సవాలలో 13.5 గ్రాముల బంగారం, 17.5 గ్రాముల పాల వెండి కానుకలుగా వచ్చినట్లు ఈవో తెలిపారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, ఎస్.చిన్న వెంకయ్యదొర, దొండా నానాజీ, జనసేన నేత వీర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బాలిక అదృశ్యం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలో వడ్డాది కొత్తూరు రెల్లి కాలనికి చెందిన ముత్యాల శాంతి కుమారి (17) ఈనెల 15వ తేదీ నుండి కనిపించలేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై ఎ శ్రీనివాసరావు తెలిపారు. బాలిక ఇంటర్మీడియట్ పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 94409 04211 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

21న సుగర్ ఫ్యాక్టరీ వద్ద ధర్నాకు తరలిరావాలి

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఫ్యాక్టరీ వద్ద జరుగు ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పరిరక్షణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని అంభేరిపురం, జుత్తాడ, అంకుపాలెం, శ్రీరామపట్నం, పిఎస్ పేట గ్రామాల్లో బుధవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు, పరిరక్షణ కమిటీ నాయకులు కర్రి అప్పారావు, కె.సదాశివరావు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సజావుగా జరగకపోవడం వల్ల రైతులు చెరుకు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఫ్యాక్టరీని ఆధునీకరించి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు గాలికి వదిలేసిందన్నారు. రైతులు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, లేనిపక్షంలో గోవాడ ఫ్యాక్టరీ కూడా మూతపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులపై గ్రామసభ బుధవారం జరిగింది. గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలి నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధి హామీ కూలీలు, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పనులపై సమీక్షా చేశారు. ఈ కార్యక్రమంలో మండల అబ్జర్వర్ కె.సూర్య నారాయణ, సోషల్ ఆడిట్ డిఆర్‌పికే. వర ప్రసాద్, ఉప సర్పంచ్ గొంతిని ఈశ్వరరావు, వార్డు మెంబర్లు పరవాడ చిన రమణ, కలగా వరలక్ష్మీ, ఎదిరి నాయుడు, గొంతిని మంగ, సెక్రటరి విజయ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ సలాది సతీష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం సాయినగర్ కాలనీలో రూ.20 లక్షలతో తాగునీరు పైపులైను నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వాటర్ సప్లై అధికారులు, జనసేన, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

-సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో జాలంపల్లి పంచాయతీలో శివారు సిరిపురం గిరిజన గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కారం చేయాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం కే.భవాని మాట్లాడుతూ, సిరిపురం గిరిజన గ్రామానికి ఇది వరకు ఇంటింటి కుళాయిలు మంజూరు చేశారని, గ్రామంలో రిగ్గుతో రంధ్రం కోయగా నీరు పడిందన్నారు. కుళాయిలు ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా వాటర్ ట్యాంక్ కట్టించి నీరు అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారని, ఇప్పటివరకు ఇంటింటి కుళాయిలు గ్రామంలో ఏర్పాటు చేయలేదన్నారు. మంచి నీరు మోటార్ కూడా వేయలేదన్నారు. ఇంటింటి కుళాయిలు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సిరిపురం గ్రామానికి మంచినీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెదల రాధ, చెదల కృష్ణ, సిత్రాల సన్యాసిరావు, కిల్లో కాంతమ్మ, కిల్లో సత్తిబాబు, కోర్రా సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - రావికమతం:రేషన్ కార్డు దారులందరూ ఈనెల 30 లోపు ఇకెవైసీ చేయించుకోవాలని, లేని పక్షంలో రేషన్ నిలుపుదల జరుగుతుందని తహసిల్దార్ బి .వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈకేవైసీ చేయించుకోలేని రేషన్ కార్డుదారులందరి జాబితాను ఆయా గ్రామాల రేషన్ డీలర్లకు అందజేశామన్నారు. వారందరూ ఈ నెలాఖరులోపు తప్పనిసరిగా ఇకెవైసీ చేయించుకోవాలన్నారు. రేషన్ లబ్ధిదారులు రేషన్ డీలర్ వద్ద ఉన్న ఈ పాస్ మిషన్ ద్వారా ఇకెవైసీ చేసుకోవచ్చు అని తెలిపారు.

కోటవురట్ల:రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఈకేవైసీ తప్పనిసరి చేసిందని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. ఇకేవైసి పూర్తికానట్లయితే వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు పొందే వీలు ఉండదని, ప్రతి ఒక్కరు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి చేయించుకోవాలని తెలిపారు. గతంలో ఇకెవైసీ పూర్తి కాకపోయినా రేషన్ సరుకులు అందేవన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -కొత్తకోట:భీముని పట్నం -నర్సీపట్నం (బి ఎన్) రోడ్డులో దొండపూడి చెక్ పోస్ట్ వద్ద మంగళ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. రోలుగుంట మండలం శరభ వరం గ్రామానికి చెందిన జల్లూరు ఈశ్వరరావు తన బైక్ పై రావికమతం మండలం ఎర్ర బంద గ్రామంలో ఓ శుభ కార్యక్రమం పాల్గొనేందుకు వెళ్తుండగా దొండపూడి చెక్ పోస్ట్ వద్ద నిర్మాణం లో ఉన్న కల్వర్ట్ లో అదుపు తప్పి పడి పోయాడు. ఈశ్వరరావు సహ తప్పి పడి పోవడం తో పాటు రాత్రి సమయం కావడం తో రాత్రంత అక్కడ ఉన్నాడు. బుధవారం తెల్లవారుజామున అటుగా వాకింగ్ వెళ్లిన వ్యక్తులు గమనించి కొత్తకోట పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వ్యక్తి ని ప్రథమ సికిత్స అనంతరం మెరు గైన సికిత్స కోసం నర్సీపట్నం ఆసుపత్రి కి తరలించారు. కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 నుండి తలుపులమ్మతల్లి తీర్థం

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని తమ్మంగుల గ్రామంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు తలుపులమ్మ తల్లి తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ సలిమిలి లక్ష్మయ్య తెలిపారు. ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ తీర్థ మహోత్సవంలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి పది గంటల వరకు కుంకుమ పూజ, హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు సినీ డూప్స్, రెండో రోజు సూర్య అబ్బాయి ఈవెంట్స్, మూడో రోజు చంటి ఈవెంట్స్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

లేని పోని విమర్శలు సరికాదు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నూకాలమ్మ తల్లి గుడికి సంబంధించి తాను గౌరవంగా గౌరవ స్వీకర్ అయ్యన్న అని సంభోవిస్తే అయ్యన్నపాత్రుడు తనపై విమర్శలు చేయించారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, తమకు గౌరవం ఇస్తే తాము గౌరవిస్తామన్నారు. 2019 డిసెంబరులో తర్వాత టెండర్లు పిలిచి నూకాలమ్మ తల్లి గుడి కడితే తమ హయాంలో కట్టామని స్పీకర్ అనడం సిగ్గు చేటన్నారు. లేనిపోని మాటలు మాట్లాడితే ప్రజలు నమ్మరన్నారు. రూ.10లక్షలు సిఎంఆర్ అధినేత ఇస్తే ఆలయ చైర్మన్ ప్రతీ పైసా గుడి కోసం కడితే దానిపై కూడా ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. రూ.20లక్షలు సిఎంఆర్ అధినేత శ్మశానానికి ఇస్తే దానిపై మాట్లాడరన్నారు. మీరు చేస్తే నీతి మేము చేస్తే అవినీతా అని ప్రశ్నించారు. రోలుగుంట మండలంలో క్వారీల్లో లక్షల రూపాయలు దండుకుంటున్నారని విమర్శించారు. ఎవరైనా అడిగితే ఏపీ ట్యాక్స్ అంటున్నారని, త్వరలో ఏ అంటే ఏంటో పీ అంటే ఏంటో తెలుస్తుందన్నారు. అనాడు అధికారంలోకి రాకముందే లేటరైట్ అడ్డుకుంటామని చెప్పి ఇప్పుడు లేటరైట్ రైట్ రైట్ అంటున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరిమికొడతారన్నారు.

సర్పంచులకు కనీస విలువ ఏదీ?

మండల సమావేశంలో జెడ్‌పిటిసి గిరిబాబు ధ్వజం

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-అకాపల్లిడెస్క్:అధికారులు సర్పంచ్‌లకు కనీస ఇవ్వకపోవడంపై గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గజ్జలవు మణికుమారి అధ్యక్షతన గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ, అధికారంలో ఎవరైనా ఉండవచ్చు కానీ సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వారికి కనీస సమాచారం ఇవ్వకుండా అవమానపర్చడం సరైంది కాదన్నారు. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత, ఏఎల్.పురం ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్, రుత్తల రామకృష్ణ మధ్య డ్రైనేజీ కాలువ పూడికపై తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ సభలో పలువురు సభ్యులు తమ పంచాయతీల్లో సమస్యలను లేవనెత్తారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మేరీరోజ్, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సుర్ల ఆదినారాయణ, జక్కు నాగమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-రావికమతం:పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి అన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో అన్ని వీధులలోనూ చెత్తాచెదారం లేకుండా చేస్తామన్నారు. పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, ఆరుబయట మలవిసర్జన, తదితర వాటిపైన ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ప్రతి మూడవ శనివారం ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి రాజబాబు, ప్రజల సమన్వయంతో పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాబు, ఆశ కార్యకర్త రాము, వెలుగు వివోఏ మహేష్ పాల్గొన్నారు.

శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

పరిశీలిస్తున్న ఎంపిడిఓ

సంపద కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చు కోవాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండలంలోని బుధవారం ఆయన గుల్లిపాడు, దోసలపాడు, జి.జగన్నాథ పురం, గొడిచెర్ల గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సబ్ ట్రెజరీ భవనం స్థల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి :రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి లో సబ్ ట్రెజరీ భవన నిర్మాణానికి 75 లక్షలు రూపాయలు మంజూరు చేయించారని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. నక్కపల్లిలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయం పాత భవనాన్ని తొలగించి, నూతన భవనం నిర్మించడానికి గాను బుధవారం ఎస్‌టిఓ అనిత, డిఈ ప్రసాద్, ఏఈ స్వరూప్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు

'పద్ధతులపై మాట్లాడటం ఆశ్చర్యకరం'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గౌరవం, పద్ధతుల గురించి మాట్లాడటం చాలా ఆశ్చర్యకరంగా ఉందని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. బుధవారం ఆయన నర్సీపట్నంలో మీడియాతో మాట్లాడారు. నూకాలమ్మ గుడికి రూ.10లక్షల సిఎంఆర్ అధినేత డబ్బులు ఏమయ్యాయని అడిగితే చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. నూకాలమ్మ, మరిడమ్మ పండుగలు నిర్వహించినప్పుడు స్టేజ్ ప్రోగ్రాం లేకుండా చేశారన్నారు. సీఎంఆర్ అధినేత శ్మశానాన్ని ఎంతో అభివృద్ధి చెందారన్నారు. ఇప్పటికైనా చేస్తున్న అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు.

ఘనంగా నూకాలమ్మ గరగల ఊరేగింపు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలంలోని లింగంపేట గ్రామంలో ఈ నెల 28న జరిగే నూకాలమ్మ అమ్మవారి పండుగను పురస్కరించుకొని బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఆధ్వర్యంలో నూకాలమ్మ తల్లి గరగలు ఊరేగింపు చేపట్టారు. గ్రామ ఆచారం ప్రకారం ఉత్సవాలకు పది రోజులు ముందుగా గరగలకు గ్రామస్తులంతా పూజలు నిర్వహించి ముందుగా గొలుగొండ పంపిస్తారు. ప్రజలంతా గరగలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి సాగనంపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు మరిసా వెంకటరమణ, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, గింజర్తి మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ లంక సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంటరీ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గోలకొండ శ్రీకాంత్, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలోని దోసలపాడు, వేంపాడు, పెదతీనార్ల గ్రామ సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్ వినియోగించుకోవాలన్నారు. 0 నుంచి 6 సంవత్సరాలలోపు బాలబాలికలు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి శత శాతం ఆధార్ నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు.

పి 4 సర్వే పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి- 4 సర్వేను శత శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. మండలంలోని జి జగన్నాథపురంలో జరుగుతున్న పి-4 సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. వేగవంతంగా సర్వేను పూర్తి చేయాలన్నారు.

వేలం పాటకు హాజరైన అధికారులు, రైతులు

ఆలయ భూముల వేలంపాట వాయిదా

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల గ్రామంలో నూకాలమ్మ ఆలయ భూములు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కౌలు వేలంపాట వాయిదా పడింది. ఎక్కువ మంది రైతులు వేలం పాటకు హాజరు కాక పోవడంతో ఈ నెల 28న మధ్యాహ్నం రెండు గంటలకు వేలంపాట నిర్వహిస్తామని ఎండోమెంట్ అధికారి ఎస్వివి. సత్యనారాయణ తెలిపారు. బుధవారం సచివాలయం 2లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏడు సంవత్సరాలుగా నలుగురు రైతులు కట్టవలసిన కౌలు నగదు శిస్తు రూ.2లక్షల 96 వేల 600 రావాల్సి ఉందని ఆయన తెలిపారు. మొత్తం భూమి ఆరు ఎకరాల 65 సెంట్లనీ 28న వేలం వేయడం జరుగుతుందని, వేలంపాటకు రైతులు తప్పకుండా రావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆయనతోపాటు బలిఘట్టం దేవస్థానం ఈవో దివ్యతేజ ఉన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు వద్దాది రంజిత్ వర్మ, లెక్కల కాశీబాబు, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు, గండి గోవింద్, జొన్నపల్లి రమేష్, పి.రాము, బి. మోదినాయుడు, జి.గణేష్, వి.ప్రకాష్, చిన్ని అచ్చిబాబు, డి.సూరిబాబు, బి.నాయుడు పాల్గొన్నారు.

బస్‌ను ఎక్కుతున్న విద్యార్థులు

టెన్త్ విద్యార్థులకు బస్ సౌకర్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:10వ తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. కోటవురట్ల వచ్చి పరీక్షలు రాసే విద్యార్థులకు రోడ్డు రవాణా సంస్థ బస్సు సౌకర్యం కల్పించడం పట్ల కొడవటిపూడి, వెంకటాపురం, తిమ్మాపురం, లింగాపురం విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేవలం ఆటోలు తప్ప ఎటువంటి రవాణా సౌకర్యం లేదు. ప్రస్తుతం బస్సు సౌకర్యం కల్పించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజులకోసారి నీరు వస్తోంది..

-సిపిఎం ప్రజా చైతన్యయాత్రకు వెల్లువెత్తిన సమస్యలు

గాజువాకలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-గాజువాక : రెండు రోజులకోసారి జివిఎంసి తాగునీరు సరఫరా చేస్తోందని, విద్యుత్ బిల్లులు, ఇంటిపన్నులు అధికంగా పెంచేయడంతో ఇబ్బందులు పడుతున్నామని జివిఎంసి 70వ వార్డుదశమకొండ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆప్రాంతంలో సందర్శించిన సిపిఎం బృందం ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సొంత స్థలాలు, ఇంటి కోసం దరఖాస్తులు ఇవ్వడంతో తప్ప మంజూరైన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సిపిఎం నేతల బృందం స్పందిస్తూ, ప్రజాసమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఆందోళన చేయాలని నిర్ణయించారు కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, దశమకొండ కార్యదర్శి ఎస్ రాజు, సీనియర్ నాయకులు పల్లెల నర్సింగరావు, మంగ, వెంకట్, లక్ష్మి, కుసుమలక్ష్మి, దాలినాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

సొంతిళ్లు కలగానే మిగిలిపోతోంది..

ములగాడ : ఇంటిస్థలాలు, ఇళ్లకోసం దరఖాస్తు పెట్టుకోవడమే తప్ప మంజూరు కావడంలేదని, దీంతో ఏళ్లతరబడి నగరంలో ఉన్నా అద్దింట్లో నివాసముండక తప్పడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

కె.కోటపాడులో..

బుధవారం జివిఎంసి 59వ వార్డు శాంతిగిరి కాలనీలో ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం బృందానికి స్థానికులు సమస్యలను ఏకరువు పెట్టారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి నేతృత్వంలో సిపిఎం బృందానికి కాలనీలో నివాసముంటున్న ముఠా, భవన నిర్మాణ, ఆటో కార్మికులు రోజువారి కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉచితగ్యాస్ డబ్బులు పడలేదని, తాగునీరు, విద్యుత్ బిల్లులు, వీధిదీపాలు ఇతర సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ప్రజాచైతన్యయాత్రలో గుర్తించిన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు బూడి శ్రీను, కె.రమణ ఏరియా కార్యదర్శి దున్న రాజేష్, కార్యకర్తలు జి. రామకృష్ణ, ప్రశాంత్, ఎల్ రాంబాబు, రమణ, జమ్ము, ఈశ్వరరావు చీమల పైడినాయుడు, జె. రామునాయుడు పాల్గొన్నారు

ఏళ్లు గడుస్తున్నా అందని ఇళ్ల పట్టాలు

ఆరిలోవ : ఏళ్లు గడుస్తున్నా తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదని జివిఎంసి 10వ వార్డు కొండవాలు బిఎన్ఆర్ నగర్ ప్రజలు సిపిఎం బృందం ముందు గోడు వెళ్లబోసుకున్నారు. బుధవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్కెఎస్వి కుమార్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం ఇంటింటా పర్యటించి, సమస్యలపై ఆరా తీసారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ బిఎన్ఆర్ నగర్ కొండవాలులో 15ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్న రోజువారీ కూలీలకు నేటికీ పట్టాలు అందలేదన్నారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు కొండపై ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి, కుళాయిలు ఏర్పాటుచేయాలని, యుజిడి ఏర్పాటు, కొండచరియలు నుంచి రక్షణకు గోడల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రం, సామాజిక భవనం ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నుల భారంపై ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.నాగరాజు, ఎ.రమణ, కె.గురుమూర్తి, సిహెచ్ రాము. పి.మణి పాల్గొన్నారు.

గ్రామాలలో ప్రజా చైతన్య యాత్ర

కె.కోటపాడు : మండలంలోని సూదివలస, పాతవలస, చంద్రయ్యపేట, గొట్లాం. శృంగవరం, మర్రివలస తదితర గ్రామాలలో బుధవారం సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు గండి నాయినిబాబు మాట్లాడుతూ మండలంలో మెట్ట ప్రాంతాలు ఎక్కువగా జీడి తోటలను రైతులు సాగు చేస్తున్నారని, జీడి పిక్కలకు మద్దతు ధర లభించలేదని తెలిపారు. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కేజీకి రూ.200 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వనము సూర్యనారాయణ, ఎర్ర దేవుడు, సబ్బవరపు దేముడు, సన్యాసినాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

ఆరిలోవలో మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి కుమార్

వంగలిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో బుధవారం సిపిఎం మండల నాయకులు ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలో డ్రైనేజీలో ఉన్న పూడుక తొలగింపు చేపట్టాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. మురుగు నీటి పారుదల లేకపోవడంతో ప్రజలను దోమలు వెంటాడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వై.సోంబాబు, సిపిఎం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

లేటరైట్ తవ్వకాలపై ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:లేటరైట్ తవ్వకాలపై వస్తున్న వార్త కథనాలపై కూటమి ప్రభుత్వం వైఖరి వెల్లడించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నాతవరం మండలం సుందరకోట పంచాయితీ భమిడికలొద్దులో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లేటరైట్ తవ్వకాలకు సిద్ధపడుతునట్లు పత్రికలో వార్తలు వచ్చాయన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లేటరైట్ తవ్వకాలు, అక్రమాలపై ప్రశ్నించిన కూటమి నేతలు నేడు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్న కూటమి నేతలు గిరిజనుల మనుగడ, అటవీ, పర్యావరణానికి ప్రమాదం తలపెట్టే లేటరైట్ తవ్వకాలను వ్యతిరేకించి ప్రజల పక్షాన నిలబడాలన్నారు. బినామీ పేరున ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయించాలన్నారు. వైసిపి హయాంలో జరిగిన లైటరైట్ అక్రమ తవ్వకాలుతో అటవీని, పర్యావణాన్ని నాశనం చేసి అటవీ, గిరిజన చట్టాలను ఉల్లంగించి కొట్లాది రూపాయల విలువ గల మైనింగ్‌ను తరలించారన్నారు. ఇప్పుడు అదే జరిగితే గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడా లేనట్టే అవుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత రాజు

సాహిత్యకు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ విభాగ పరిశోధక విద్యార్థిని కరి సాహిత్యకు డాక్టరేట్ లభించింది. వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను సాహిత్య అందుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగ ఆచార్య సర్వసతీ విద్యార్థి, వేద విశ్వవిద్యాలయం తిరుపతి పాంచరాత్ర ఆగమ విభాగ ఆచార్య విటిజి భరతశేఖరాచార్యుల పర్యవేక్షణలో 'పాంచరాత్ర ఆగమంలో సంగీత ప్రాధాన్యత' అంశంపై పరిశోధన చేసినందుకు గాను సాహిత్యకు డాక్టరేట్ లభించినది.

వీసీ ద్వారా డాక్టరేట్ అందుకుంటున్న సాహిత్య

సమస్యలపై ఎయు వీసీకి వినతి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘాలు జిసిటిఎ, జిసిజిటిఎ సంఘం నాయకులు బుధవారం ఎయు వీసీ, రిజిస్ట్రార్‌లను కలిసి అనుబంధ కళాశాల సమస్యలను విన్నవించారు. వడగాల్పుల కారణంగా వేసవి సెలవులను మే 1 నుంచి జూన్ 15 వరకు కల్పించాలని, పేపర్ వేల్యూషన్‌లో ప్రభుత్వ అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలని, యుజి విద్యార్థులకు పాత యూజీ కోర్స్ ఎంచుకోవడానికి అవకాశం కల్పించాలని, అర్హత ఉన్న అధ్యాపకులకు రీసెర్చ్ గైడ్ షిప్, యూనివర్సిటీలో యూనివర్సిటీలో రీసెర్చ్ చేసుకున్న అవకాశాన్ని కల్పించాలని, పేపర్ వేల్యూయేషన్ రెమ్యూనరేషన్ పెంచాలని కోరారు.